ఆరోగ్య సిరి ధాన్యాలు




సమతుల ఆహారంగా కొర్రలు

కొర్ర బియ్యంతో చేసే వంటకాలను సమతుల ఆహారంగా భావించవచ్చు. 8 శాతం పీచు, 12.3 శాతం ప్రొటీన్లు వీటిలో ఉంటాయి. గర్భిణుల్లో వచ్చే మలబద్ధకాన్ని కూడా కొర్ర ఆహారం పోగొడుతుంది. పిల్లల్లో జ్వరం వచ్చినప్పుడు మూర్ఛ రాకుండా కొర్రలు నివారిస్తాయని అంటారు. నరాల బలహీనతకు, కొన్ని రకాల చర్మ రోగాలకు, నోటి క్యాన్సర్, ఉదర క్యాన్సర్, పార్కిన్‌సన్స్(మతిమరుపు), అస్తమా (అరికలతో పాటుగా ఉపయోగించుకొని) నివారణకు కొర్రలతో తయారయ్యే ఆహారం ఔషధంగా పని చేస్తుంది.

మానవ జీవితంలో వేగం, ఒత్తిడి పెరిగి కొత్త వ్యాధులు బెంబేలెత్తిస్తున్నాయి. పూర్వకాలంలో చిరు ధాన్యాలు ఆహారంలో కీలకంగా ఉండేవి. అయితే ప్రస్తుత హైటెక్ ప్రపంచంలో జీవన విధానాలు పూర్తిగా మారిపోయాయి. ఆహారపు అలవాట్లు మారాయి. ఆరోగ్యానికి అనుకూలంగా ఉండే ఆహారం కనుమరుగైపోయింది. ఈ పరిస్థితుల్లో చిరుధాన్యాలకు ఉండే ఔషధ గుణాల మీద చర్చ జరుగుతోంది. భయంకరమైన, దీర్ఘకాలిక రోగాలు సైతం చిరు ధాన్యాలతో తగ్గుతాయని శాస్త్రీయ ఫలితాలలో సైతం స్పష్టమైంది. ఈ నేపథ్యంలో 7 రకాల చిరు ధాన్యాల పునరుద్ధరణకు వ్యవసాయ శాస్త్రవేత్తలు చర్యలు తీసుకున్నారు. వీటి విశిష్టతలను జనంలోకి తీసుకు వెళ్ళేందుకు శాస్త్రవేత్తలు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

రోగాల నయంలో.. ఏడు రకాల చిరు ధాన్యాలు

ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉన్న వారు చిరు ధాన్యాలు వాడితే సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని పరిశోధనల్లో తేలింది. చిరు ధాన్యాలను క్రమం తప్పకుండా రెండు రోజులకు ఒక చిరు ధాన్యం చొప్పున ఆహారంగా తీసుకోవాలి. చిరు ధాన్యాంతో కషాయాలను తీసుకుంటే సానుకూల ఫలితాలు ఉంటాయి. హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటి వ్యాధులతోపాటు ఇతర దీర్ఘకాలిక రోగాలతో బాధ పడే వారిలో రోగనిరోధక శక్తిని చిరు ధాన్యాలు పెంచుతాయి.

నంద్యాల టౌన్, జూన్ 16 : అనారోగ్యాలు పెరిగేకొద్దీ ఆహార స్పృహ పెరిగింది. వ్యాధులు వచ్చాక మందులు వాడేకంటే, ఆరోగ్యంగా ఉండే ఆహారం తీసుకోడానికి చాలా మంది ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా చిరు ధాన్యాల వాడకం పెరిగింది. దీర్ఘకాలిక వ్యాధుల నివారణలో ఇవి కీలకంగా ఉన్నాయి. దీంతో చిరుధాన్యాల సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలకు అనుగుణంగా రైతులు ముందుకు వెళుతున్నారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవంగా ప్రపంచ దేశాలు పాటించాయి. రాష్ట్రంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నేతృత్వంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు, వ్యవసాయ శాఖ సమష్టిగా చిరుధాన్యాల సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు విశేష కృషిని ప్రణాళికా బద్ధంగా చేపట్టారు.

- వ్యాధులను నయం చేసే ఏడు రకాలు
- దీర్ఘకాలిక వ్యాధుల నివారణలోనూ కీలకం
- చిరు ధాన్యాల సాగుకు సిఫారసులు



సామలు భేష్

చిరు ధాన్యాల్లో సామల బియ్యానికి ఓ ప్రత్యేకత ఉంది. మగ, ఆడ వారి పునరుత్పత్తి మండలంలోని వ్యాధులను బాగు చేస్తాయి. ముఖ్యంగా మగవారిలో వీర్య కణాల సంఖ్య పెరిగేందుకు దోహదం చేస్తాయి.



ఊదలు విశిష్టమైన ధాన్యం

చిరు ధాన్యాల్లో విశిష్టమైనవి ఊదలు. థైరాయిడ్, క్లోమ గ్రంథులకు వచ్చే వ్యాధులు, చెక్కర వ్యాధి నివారణకు ఊదల బియ్యం పని చేస్తాయి. కాలేయం, మూత్రాశయం, గాల్‌బ్లాడర్ శుద్ధికి కూడా ఊదల బియ్యం ఆహారం ఔషధంగా ఉపయోగపడుతుంది.

ఔషధంగా అరికలు

అరికల బియ్యంతో చేసే వంటకాలు రక్త శుద్ధికి, ఎముకల మజ్జ మరింత సమర్థవంతంగా పని చేసేందుకు ఔషధంగా ఉపయోగపడతాయి. అస్తమా, మూత్రపిండాల వ్యాధి, ప్రొస్టేట్, రక్త క్యాన్సర్, పేగుల థైరాయిడ్, గొంతు, క్లోమ గ్రంథులు, కాలేయపు క్యాన్సర్‌లు తగ్గించుకోవడానికి అరికలు ఉపయోగపడతాయి. చెక్కర వ్యాధి ఉన్నవారికి దెబ్బలు తగిలినప్పుడు పుండ్లు మానడానికి అరికల ఆహారం ఉపయోగపడుతుంది.

అండ కొర్రలు అద్భుతం



అండ కొర్రల బియ్యం వల్ల జీర్ణ మండలంలోని వ్యాధులు తగ్గుతాయి. మొలలు, మూలశంక, అల్సర్‌లు, మెదడు, రక్తనాళాల ఎముకలు, ఉదర, పేగుల, చర్మ క్యాన్సర్ల నివారణకు అండ కొర్రల బియ్యం ఆహారం అద్భుత ఔషదంగా పని చేస్తుంది.

రాగి అన్నంతో



రాగిలో పోషకాలు అత్యంత సమృద్ధిగా ఉంటాయి. కాల్షియం, ఐరన్ శాతం ఉండటంతో పిల్లలకు రాగిముద్ద, రాగులతో తయారు చేసిన రొట్టే, అంబలి, లడ్డు, గంజి ఇస్తే ఆరోగ్యంగా ఉంటారు. . రాగిలో ప్రొటీన్ల శాతం ఎక్కువగా ఉంటాయి. రక్తంలో చక్కెర అంశాన్ని తగ్గించడం వల్ల మధుమేహ వ్యాధి రోగులకు మంచిది. వారికి గాయాలు త్వరగా నయం అవుతాయి.

కొవ్వు శాతం తగ్గించే వొరిగెలు



వొరిగె బియ్యంతో తయారు చేసే వంటకాల్లో ఎక్కువ ప్రమాణంలో పిప్పి, ఫ్యాటీయాసిస్ ఉంటాయి. పాస్పరస్, క్యాల్షియం, మాంగనీస్, మెగ్నీషియం సమృద్ధిగా ఉంటాయి. వీటి వల్ల శరీరంలో కొవ్వు శాతం తగ్గుతుంది. నరాలు బలంగా ఉండటానికి, గుండె పోటు, క్యాన్సర్ వ్యాధుల బారిన పడకుండా వొరిగెల ఆహారం ఉపయోగపడుతుంది. వొరిగెల ఆహారం రోజు తింటే శరీరంపై త్వరగా ముసలితనం అగుపడదు. పీచు పదార్థాలు ఎక్కువగా ఉండటం వల్ల మధుమేహ రోగులకు ఉపయోగకరం.

చిరు ధాన్యాల వాడకంతో ఆరోగ్య పరిరక్షణ



ఒక్కొక్క చిరు ధాన్యంలో ఒక ప్రత్యేకమైన విశిష్టత ఉంటుంది. ఇవి బలవర్థక ఆహారంగా ఉపయోగపడుతాయి. చిరు ధాన్యాల సాగు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకం ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నాయి.

- డాక్టర్ సీవీ చంద్రమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, చిరుధాన్యాల పరిశోధనా శాస్త్రవేత్త, గుంటూరు

పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న పోలీసు అధికారి

నంద్యాల క్రైం, జూన్ 16: నంద్యాల జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఆదివారం ఎస్పీ క్యాంప్ కార్యాలయ సమావేశ హాలులో ఎస్పీ జిల్లా పోలీస్ అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా, ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా ఓటర్లందరూ నిర్భయంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేశారన్నారు. ఎన్నికల కోడ్ మొదలైనప్పటి నుంచి ఎన్నికల కౌంటింగ్ పూర్తయి ఎన్నికల కోడ్ ముగిసే వరకు అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఎన్నికల సందర్భంగా అధికారులు, సిబ్బందికి ఎదురైన సమస్యలు వాటిని అధిగమించిన తీరు, అధికారులు, సిబ్బంది అనుభవాలను సమావేశంలో నెమరువేసుకున్నారు. ఎస్పీ కృషి వల్లే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని పలువురు అధికారులు పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమావళికి అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. ఎన్నికల నిర్వహణతోపాటు శాంతిభద్రతలను పరిరక్షించడంలో అందరూ కష్టపడ్డారని ప్రశంసించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, డీఎస్పీలు వై.శ్రీనివాసరెడ్డి, ఎ.శ్రీనివాసరావు, ఎస్. నర్సుద్దీన్, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమవుతూ..

- వార్డు పర్యటనకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శ్రీకారం



మహిళల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూన్ 16: డోన్ పట్టణంలోని వార్డుల్లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. గతంలో ఏ ఎమ్మెల్యే కూడా చేయని విధంగా ప్రస్తుత ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలిచిన వెంటనే ప్రజల వద్దకు వెళ్తున్నారు. ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుంటున్నారు. నేనున్నానంటూ ఎమ్మెల్యే కోట్ల భరోసా ఇస్తున్నారు. పట్టణంలోని కొండపేట బీసీ హాస్టల్ ప్రాంతంలో ఉదయం 7 గంటలప్పుడు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పర్యటించారు. మున్సిపల్, సచివాలయ సిబ్బం ది పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కోట్ల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు డ్రైనేజీ కాలువలు లేక అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి విజయ భట్టు, అన్వర్‌బాషా, కిరణ్ యాదవ్, కిషన్‌సింగ్, వెంకట్రాముడు, గురుస్వామి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు వసూలు చేస్తే చెప్పండి

పట్టణంలో వార్డు పర్యటన సందర్భంగా కొండపేటలోని ఫ్లైఓవర్ కింద చిరువ్యాపారులతో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడారు. ఎవరైనా డబ్బులు అడిగి వసూలు చేస్తే తనతో చెప్పండని సూచించారు.

- బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థన చేసుకునే ప్రాంతాన్ని ఎమ్మెల్యే కోట్ల పరిశీలించారు. బక్రీద్ సందర్భంగా ప్రార్థనలు చేసుకునేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. జెండా కట్ట వీధిలోని దర్గాలో ఎమ్మెల్యే కోట్ల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కిలో టమోటా రూ.90

ఆకాశన్నంటిన కూరగాయల ధరలు



చాగలమర్రి, జూన్ 16: కూరగాయల రేట్లు భగ్గుమంటున్నాయి. చాగలమర్రి వారపు సంతలో కూరగాయల రేట్లు ఆకాశన్నంటాయి. కూరగాయల ధరలు సామాన్యుల నడ్డి విరిస్తున్నాయి. ఇంత ధర వెచ్చించి కొనలేమని సామాన్య, మధ్యతరగతి ప్రజలు అంటున్నారు. మార్కెట్‌లో కిలో టమోటా రూ.90, కిలో మిర్చి రూ.120, కాకరకాయలు కేజీ రూ.120, చిక్కుడు కాయలు కేజీ 160, బీరకాయలు కేజీ రూ.120, క్యారెట్ రూ.100, బీన్స్ కేజీ రూ.160, అల్లం కేజీ రూ.200 పలికాయి. ఏ కూరగాయ చూసినా కేజీ రూ.80 నుంచి రూ.100 పైనే పలుకుతుండటంతో కొనలేకున్నామని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని కూరగాయల ధరలను అదుపు చేయాలని పేద, మధ్య తరగతి ప్రజలు కోరుతున్నారు.

నేడు బక్రీద్

ఉమ్మడి జిల్లాలోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు



కర్నూలు (కల్చరల్), జూన్ 16: త్యాగనిరతిని చాటి చెబుతూ, దైవం పట్ల ఆరాధన భావాన్ని పెంపొందింపజేసే వేడుకకు 'బక్రీద్ (ఈద్-ఉల్-అదా)ను సోమవారం ఉమ్మడి జిల్లాల్లోని ముస్లింలు ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలను ప్రత్యేక ఈద్ ప్రార్థనలకు సిద్ధం చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. బక్రీద్ వేడుక రోజున ఆరుబయట ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం మత పెద్దలు ధార్మిక సందేశాలు ఇస్తారు. ఈ నేపథ్యంలో ఆయా ఈద్గాల్లో వందలాదిగా హాజరయ్యే భక్తులకు నగర పాలక సంస్థ అధికారులు తగిన సదుపాయాలు కల్పించారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండు రోడ్డులోని పాత ఈద్గాను, సంతోష్ నగర్‌లోని కొత్త ఈద్గాను ఎస్పీ జి. కృష్ణకాంత్ పరిశీలించారు. బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపుపై పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక పండుగ రోజున ఇళ్లలో తయారు చేసుకునే ప్రత్యేక తీపి వంటకాలకు కావాల్సిన సేమ్యా, డ్రైఫ్రూట్, మసాలా దినుసులు వంటి సామగ్రి కొనుగోళ్లకు పాతనగరంలోని మార్కెట్ ప్రాంతాలు సందడిగా కనిపించాయి.

- **దానగుణాన్ని, త్యాగ నిరతిని పెంపొందించేదే బక్రీద్...**

బక్రీద్ పండుగ సమాజంలోని వ్యక్తుల్లో దానగుణాన్ని, త్యాగ నిరతిని పెంపొందిస్తుంది. తమ ఇంటితోపాటు పేదలు, దగ్గరి బంధువులు, ఇరుగుపొరుగు వారిని కూడా ఈ సంతోషంలో భాగస్వామ్యం చేయాలని ఉద్బోధిస్తుంది. తమకు కలిగిన దానిలో కొంత దానం చేసి, తాము తినేదానిలో కొంత ఇతరులకు పెట్టాలని చెబుతుంది. అందుకే బక్రీద్ వేడుక రోజున త్యాగనిరతిని చాటుకుంటూ ఇతరులకు తమవంతు సహకారాలు అందిస్తారు.

మంత్రి బీసీని కలిసిన కలెక్టరు, ఎస్పీ



రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని అభినందిస్తున్న కలెక్టరు శ్రీనివాసులు

బనగానపల్లె , జూన్ 16: రాష్ట్ర నూతన రోడ్లు, భవనాలు, పెట్టుబడుల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలెక్టరు శ్రీనివాసులు, ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టరు రాహుల్‌రెడ్డి ఆదివారం కలిశారు. బీసీకి పుష్పగుచ్చాలు ఇచ్చి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. బనగానపల్లెకు చెందిన బీసీకి తొలిసారి మంత్రిపదవి దక్కడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.




పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ, జేసీ

హామీలను నెరవేరుస్తాం: మంత్రి బీసీ



బనగానపల్లె, జూన్ 16: తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో మంత్రి విలేఖర్లతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారని అన్నారు. డిసెంబరులోగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై రెండో సంతకం, పెన్షన్ల పెంపకంపై మూడో సంతకం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై 4వ సంతకం, స్కిల్ డెవలప్‌మెంట్‌పై సంతకం పెట్టి సీఎం చంద్రబాబునాయుడు విశ్వసనీయత చాటారని అన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం, సుపరిపాలన ఒక్క ఎన్డీఏ ప్రభుత్వం వల్లనే అవుతుందన్నారు.



రబీ నష్టం లెక్కింపులో నిర్లక్ష్యం

- పంట దున్నేసిన నాలుగు నెలలకు నష్టం లెక్కించిన వైనం
- ఉమ్మడి జిల్లాలో 54 మండలాల్లో అనావృష్టి
- 31 మండలాలకే కరువును పరిమితం చేసిన వైసీపీ ప్రభుత్వం
- టీడీపీ ప్రభుత్వంపైనే రైతుల ఆశలు
- 19 నుంచి 21 దాకా కరువు పరిశీలనకు కేంద్ర బృందం పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 16:

గత రబీలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారిని అదుకోకుండా వైసీపీ ప్రభుత్వం దగా చేసింది. దాదాపు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రైతులు 3 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేసి నష్టపోతే 1.30 లక్షల హెక్టార్లలో, 128.57 కోట్ల పంట నష్టం మాత్రమే జరిగిదని అధికారులు నివేదిక తయారు చేశారు. అయితే అప్పటి ప్రభుత్వం మాత్రం గత నెల 24, 25 తేదీల్లో క్షుణ్ణంగా సర్వే చేసి నష్టాన్ని అందజేయాలని ఆదేశించింది. పంటలన్నీ ఎండిన తర్వాత ఖాళీ పొలాల్లో రబీ నష్టాన్ని ఎలా లెక్కించాలో తెలియక అధికారులు తూతూ మంత్రంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్లల్లో కూర్చొని రెండు జిల్లాల నివేదికలు తయారు చేశారు. 128.57 కోట్లలో నష్టం జరిగిందని మొదట్లో పంపిన నివేదికను సవరించి రెండోసారి కేవలం 96.03 కోట్ల పంట నష్టం మాత్రమే జరిగిందని నిర్ధారించారు. నష్టపరిహారాన్ని కుదించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ మొత్తం అంచనాల్లో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే.. గత వైసీపీ ప్రభుత్వం రైతుల విన్నపాలను ఏ మాత్రం పట్టించుకోకుండా కనీసం రైతు భరోసా కేంద్రాల్లో నష్టపరిహారం జాబితాను ప్రదర్శించకుండా జాగ్రత్త పడింది. చాలా మండలాల్లో అధికారులు అనర్హులకు కూడా పంట నష్టపరిహారాన్ని నమోదు చేశారని, అర్హులైన రైతులను లబ్ధిదారులుగా చేర్చడంలో నిర్లక్ష్యం చేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కరువు మండలాల్లో కేంద్ర బృందం పర్యటించనుంది.



31 మండలాలకే పరిమితం చేసిన ప్రభుత్వం

గత రబీలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిలాల్లో రైతులు ప్రధానంగా సాగు చేసిన పప్పుశనగ, జొన్న, మొక్కజొన్న, మినుములు, వరి, కందులు, కొర్ర పంటలన్నీ దెబ్బతిన్నాయి. అయితే.. వర్షాలు లేక ఈ పంటలన్నీ దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ యంత్రాంగం గుర్తించి ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. వాస్తవంగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 54 మండలాల్లోనూ కరువు పరిస్థితులు తాండవించాయి. పంటలన్నీ పూర్తిగా దెబ్బతిని నష్టపోయారు. గత వైసీపీ ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోలేదు. గుడ్డిగా కేవలం 31 మండలాల్లోనే పంటలు నష్టం జరిగిందని గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, ఓర్వకల్లు, కోడుమూరు, కల్లూరు, గూడూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి హోళగుంద, హాలహర్వి, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, వెల్దుర్తి, సీ. బెళగల్ మండలాల్లోనే పంటలు నష్టపోయి కరువు పరిస్థితులు ఉన్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, దొర్నిపాడు, నందికొట్కూరు, అవుకు, కోవెలకుంట్ల, మిడ్తూరు, సంజామల, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, గోస్పాడు, జూపాడుబంగ్లా, నంద్యాల, బనగానపల్లె, గడివేముల మండలాల్లో మాత్రమే కరువు పరిస్థితులు ఉన్నట్లు నోటిఫికేషన్ జారీ చేసింది. వాస్తవంగా రబీలో పంటలు నష్టపోయిన మండలాలను ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను గుర్తించి నష్టపరిహారాన్ని అంచనావేసి రైతులకు అందజేయాల్సి ఉంది. అయితే.. ప్రభుత్వం మార్చి 16న కరువు ప్రకటన జారీ చేసింది. ఎన్నికల షెడ్యూలు వస్తున్నందు వల్ల రైతుల నుంచి ఆగ్రహావేశాలు పెల్లుబకకుండా ఈ ప్రకటన జారీ చేసిందనే విమర్శ అప్పట్లో వినిపించింది.



వైసీపీ నాయకుల ఇళ్లలో కూర్చుని అంచనా: గత రబీలో కరువు పరిస్థితిని అంచనా వేసి, నష్టపోయినవారి జాబితాను పంపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే.. జిల్లా వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది వైసీపీ నాయకుల ఇళ్లల్లో కూర్చుని నివేదికలు తయారు చేశారు. అప్పటి అధికార పార్టీకి చెందిన వారిని, పంటలు సాగు చేయని రైతులను అర్హులుగా తేల్చి వారికి పెద్ద మొత్తంలో పరిహారాన్ని అందేలా జాబితా తయారు చేశారు. అర్హులైన రైతులు ప్రతిపక్ష పార్టీకి చెందిన వారని వైసీపీ నాయకులు గుర్తిస్తే.. అధికారులు దాన్నే ప్రమాణంగా తీసుకని వారిని అనర్హులుగా తేల్చేశారు.

మార్చి 16న ప్రకటన : సాధారణంగా జూన్ 1 నుంచి వ్యవసాయ పంటల సీజన్లు మొదలవుతాయి. ఆయా సీజన్లలో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోతే ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లా అధికారులను అప్రమత్తం చేసి కరువు జాబితాలను సిద్ధం చేయాల్సి ఉంది. అయితే.. జనవరిలో గత రబీ సీజన్ పూర్తయితే.. పంటలన్నీ ఎండిన తర్వాత ఖాళీగా ఉన్న పొలాలకు వెళ్లి పంట నష్టాన్ని లెక్కించాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వారు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఏదోలాగా అమలు చేయాలని అధికారులు గత రబీలో పంట నష్టాన్ని లెక్కవేసేందుకు హడావుడిగా పొలాలకు కదిలివెళ్లారు. పొలాల్లో ఏ ఆనవాళ్లు లేకపోవడంతో ఇండ్లలో, కార్యాలయాల్లో, వైసీపీ నాయకుల వద్ద కూర్చుని నష్ట పరిహారం జాబితాను తయారు చేసి చేతులు దులుపుకున్నారు.

టీడీపీ ప్రభుత్వం న్యాయం చేయాలని రైతుల వేడుకోలు: గత సంవత్సరం ఖరీఫ్‌లో అనావృష్టి కారణంగా పంటలు ఎండిపోయి రైతులు నష్టాలపాలైతే.. ప్రభుత్వం నూటికి 30 మంది చొప్పున రైతులకు మాత్రమే పరిహారాన్ని అందించింది. అదే విధంగా రబీలో సాగు చేసిన పంటలు కూడా వానలు లేక ఎండిపోయాయి. ఈ దారుణ పరిస్థితుల నుంచి ప్రభుత్వం తమను గట్టెక్కిస్తుందని అన్నదాతలు ఎంతో నమ్మకంతో ఉన్నారు. అయితే.. వైసీపీ ప్రభుత్వం వీరి ఆశలపై నీళ్లు చల్లి దారుణంగా ముంచేసింది. ప్రాథమిక అంచనాలో రెండు జిల్లాల్లో కలిపి రూ.128.57 కోట్ల పంట నష్టం జరిగిందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ మొత్తాన్ని కుదించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడంతో జిలా అధికారులు దీన్ని రూ.96.03 కోట్లకే పరిమితం చేసేశారు.

కేంద్ర బృందం ఢిల్లీ నుంచి ఈ నెల 19, 20, 21 తేదీల్లో కరువు పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలను పరిశీలించనుంది. గత వైసీపీ ప్రభుత్వం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపడంతో భారీగా నష్టపరిహారం కుదింపు జరిగింది. ఈ పరిస్థితిని ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం తప్పకుండా గుర్తించి వాస్తవంగా నష్టపోయిన రైతులందరికీ పరిహారాన్ని అందించేందుకు కేంద్ర బృందానికి సరైన లెక్కలను తయారు చేసి చూపించాలని రైతు సంఘాల నేతలు కోరుతున్నారు.

గత రబీలో నష్టపోయిన పంటలు, రైతుల వివరాలు

పంట పేరు	నష్టపోయిన రైతులు	పంట నష్టం విస్తీర్ణం (హె.కా)
వేరుశనగ	2773	2772.51
మొక్కజొన్న	4299	5549
కందులు	773	473
జొన్న	22777	22014
మినుములు	5864	4891
వరి	1512	1155
కొర్ర	1216	1207
పప్పుశనగ	71055	73871

రైతుల్ని ఆదుకోండి..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో తీవ్రంగా రైతులు నష్టపోయారు. కర్నూలు జిల్లాలో కేవలం 18 మండలాలు, నంద్యాల జిల్లాలో 13 మండలాల్లో మాత్రమే గత ఖరీఫ్‌లో రైతులు పంటలు నష్టపోయారని ప్రభుత్వం పేర్కొనడం దారుణం. ఉమ్మడి జిల్లాలోని 54 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 19, 20 తేదీల్లో కేంద్ర బృందం ఉమ్మడి జిల్లాలో కరువు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వస్తున్నది. అందువల్ల పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు నిబంధనలను పక్కనపెట్టి జరిగిన నష్టానికి పరిహారాన్ని తెలుగుదేశం అందించాలి.

- రామక్రిష్ణ
రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

రేపు జిల్లా స్థాయి యోగా పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 16: పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో యోగా హాలులో కర్నూలు జిల్లా స్థాయి యోగా సంఘం పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి అవినాశ్ శెట్టి తెలిపారు. ఈ పోటీలు 8 నుంచి 10 సంవత్సరాలు, 10 నుంచి 12 సంవత్సరాలు, 12 నుంచి 14, 14 నుంచి 16, 16 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల వారికి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9247400100 నెంబరును సంప్రదించాలన్నారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తులు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న రజక విద్యాసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీపీ వెంకటేశ్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 16: పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన కర్నూలు, నంద్యాల జిల్లాలోని రజక కులానికి చెందిన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు రజక ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని రజక విద్యా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీపీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు నగరంలోని అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, స్కంద బిజినెస్ పార్కులోని రజక విద్యసేవా సమితి కార్యాలయంలో రజక ప్రతిభ పురస్కారాలకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ వెంకటేశ్ మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాలో పదో తరగతిలో 450 ఆపై మార్కులు సాధించిన రజక విద్యార్థులు, ఇంటర్‌లో 850 మార్కులు పైగా, డిగ్రీలో 80 శాతం, బీటెక్‌లో 80 శాతం ఉత్తీర్ణత, ఎంసెట్, మెడిసిన్, ఇంజనీరింగ్‌లో 10వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు తమ వివరాలను స్కంద బిజినెస్ పార్క్, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో షాపు నెంబర్.9, నాల్గవ అంతస్థులో సంప్రదించాలన్నారు. వివరాలకు 9110396511, 9182708114, 7780506001, 9640500145 నెంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో మాలంగిరి గణేష్, సీహెచ్ లింగమయ్య, ఎక్స్ ఆర్మీ శంకరయ్య, మహిళా నాయకురాలు బాపనపల్లి రాధ, రేణుకమ్మ, మద్దూరు వెంకటప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మహానంది, జూన్ 16: మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన చిన్న నరసింహులు(18) అనే వ్యక్తి శనివారం రాత్రి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు, గమనించిన కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు.

మంత్రి బీసీని సన్మానించిన వేదపండితులు

మహానంది, జూన్ 16: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులను మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డితో వేదపండితులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం బనగానపల్లిలోని మంత్రి స్వగృహంలో కలిసి మంత్రి దంపతులను ఆశీర్వదించారు. స్వామి వారి శేష వస్త్రం, చిత్రపటంతో సన్మానించారు. ఈ సందర్భంగా మహానంది పరిసర ప్రాంతాల్లో అధ్వానంగా రహదారులను ఆధునికీకరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి ఈవో తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.



మంత్రి బీసీ దంపతులకు మెమెంటో అందజేస్తున్న ఈవో

'వైవిధ్యమైన కవిత్వ శిల్పమే 'బాల్యమే శరణార్థి'



'బాల్యమే శరణార్థి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు(కల్చరల్), జూన్ 16: వైవిధ్యమైన కవిత్వ శిల్పం 'బాల్యమే శరణార్థి' పుస్తకంలో కనిపిస్తుందని, విశాల ప్రాపంచిక దృక్పథంతో రత్నం ఏసేపు బాల్యమే శరణార్థి సంపుటిలోని కవిత్వం రాశారని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, ఉద్యోగ క్రాంతి పత్రిక ప్రచురణగా డీటీఎఫ్ నాయకుడు, కవి కె. రత్నం ఏసేపు రాసిన బాల్యమే శరణార్థి కవితా సంకలనం ఆవిష్కరణ సభ జరిగింది. సభాధ్యక్షుడిగా కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు వ్యవహరించారు. పుస్తక ఆవిష్కర్తగా విచ్చేసిన కెంగార మోహన్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో ఏమి జరుగుతున్నదో కవి స్పష్టంగా రాశారని అన్నారు. సమాజం పట్ల ఎంతో బాధ్యతగా ఈ కవిత్వాన్ని రాశారని, అనేక కోణాలను సృజిస్తూ రాసిన కవితలు అన్ని వర్గాలను ఆకట్టుకుంటాయని తెలిపారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ విద్యారంగంలో ఎలాంటి ప్రమాదం పొంచి ఉందో కవి తన కవిత్వంలో రత్నం ఏసేపు ఆవేదనగా చెప్పారని అన్నారు. బాల్యంలోని హింసను కవి అర్థం చేసుకున్నందు వల్ల ప్రపంచంలోని అనేక హింసారూపాలను తెలుసుకొని ఈ కవిత్వం రాశారని అన్నారు. పాలస్తీనాలో, కశ్మీర్‌లో, దండకారణ్యంలో బాల్యాన్ని యుద్ధం బలి తీసుకుంటున్నదని, ఈ వేదనంతా రత్నం ఏసేపు కవిత్వంలో ఉందని అన్నారు. యుద్ధాలన్నీ బాల్యానికి శత్రువులని, ఈ నేల మీద దురాక్రమణ యుద్ధాలు ఉన్నంత వరకు బాల్యం శరణార్థిగానే ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో విరసం నాయకుడు నాగేశ్వరాచారి, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, ఆద్య మెడికల్స్ అధినేత ఏవీ రెడ్డి, యూటీఎఫ్ నాయకులు రాములు, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకుడు రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలతో భూములు గల్లంతు

డోన్(రూరల్), జూన్ 16: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డోన్ మండలంలోని గ్రామాల్లో చేసిన రీ సర్వేలో రైతుల భూములు గల్లంతయ్యాయని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అప్పటి అధికార పార్టీ నాయకుల సూచనలతో రెవెన్యూ అధికారులు గ్రామాల్లో చేపట్టిన రీ సర్వేలో భూములు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వర్షాకాలంలో ఖరీఫ్ సీజన్‌లో బ్యాంకుల ద్వారా రుణాలు పొందాలనుకునే రైతుల భూములు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

జూన్ శుభసూచకం

సాధారణం కంటే రెట్టింపు వర్షపాతం నమోదు

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 16: కర్నూలు జిల్లాలో ఈ సంవత్సరం జూన్‌లో వర్ష పాతం సాధారణం కంటే రెట్టింపు నమోదైంది. నాలుగు మండలాల్లో మాత్రమే సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. కౌతాళంలో 15 రోజులకుగానూ 110.2, ఆదోనిలో 69.8, మంత్రాలయంలో 121, కోసిగిలో 93.3, పెద్దకడుబూరులో 38.8, ఎమ్మిగనూరులో 143.2, గూడూరులో 102 ఎంఎం, కల్లూరులో 116, కర్నూలు రూరల్‌లో 125.4, ఓర్వకల్లులో 15 రోజుల్లోనే 220.8 ఎంఎం వర్షం నమోదైంది. కోడుమూరులో 83.2, గోనెగండ్లలో 97.6, హోళగుందలో 133.6, హాలహర్విలో 193.2, ఆలూరులో 197.6, ఆస్పరిలో 81, పత్తికొండలో అత్యధికంగా 200.8, చిప్పగిరిలో 220ఎంఎం, మద్దికెరలో 140.8, కర్నూలు అర్బన్‌లో 169.6, తుగ్గలిలో 137 ఎంఎం వర్షం నమోదైంది. 15 రోజులకే సాధారణ వర్షపాతానికి మించి మొత్తం మీద 122.5 ఎంఎం కర్నూలు జిల్లాలో నమోదైంది. ఇంకా 15 రోజులు సమయం ఉండటంతో రెట్టింపు వర్షపాతం జూన్‌లోనే కురిసే అవకాశం ఉందని, విత్తనాలు వేసుకునేందుకు రైతులకు మంచి అవకాశం అని జేడీ వరలక్ష్మి తెలిపారు.

మామ చేతిలో అల్లుడి దారుణ హత్య

- కూతురిని వేధిస్తుండటమే కారణం
- నిద్రిస్తున్న సమయంలో తలపై రాళ్లతో దాడి

ఉండవల్లి, జూన్ 16 : పెళ్లయిన ఏడాది నుంచి కూతురిని వేధిస్తుండటంతో సహనం కోల్పోయిన మామ అల్లుడిని చంపేశాడు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. స్థానికులు, అలంపూర్ సీఐ రవిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చాకలి మద్దిలేటి ఆరు సంవత్సరాల క్రితం తన కుమార్తె మహేశ్వరికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలులోని కొండారెడ్డినగర్ కాలనీకి చెందిన దేవేందర్ (36)తో వివాహం చేశారు. వారికి శ్యాంసుందర్, శ్రీకృష్ణ ఇద్దరు కుమారులున్నారు. అయితే మద్యానికి బానిసైన దేవేందర్ పెళ్లయిన రెండు నెలల నుంచే మహేశ్వరిని నిత్యం వేధిస్తున్నాడు. ఈ విషయంపై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్ది చెప్పారు. అయినా అతడిలో మార్పు రాలేదు. దీంతో కొన్ని నెలల క్రితం మహేశ్వరి ఉండవల్లిలోని తన పుట్టినింటికి వచ్చేసింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఆరు గంటలకు దేవేందర్ అత్తగారింటికి వచ్చి గొడవపడ్డాడు. అదే రోజు రాత్రి మద్యం తాగి వచ్చి అర్ధరాత్రి వరకు మామ, భార్యతో మళ్లీ గొడవ పడి ఇంట్లోనే పడుకున్నాడు. మహేశ్వరి పిల్లలతో కలసి నాయనమ్మ పద్మమ్మతో పాటు ఇంటి ముందున్న గుడిసెలో పడుకోగా, మద్దిలేటి బయట పడుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత మద్దిలేటి లేచి, ఆవరణలో ఉన్న నాపరాయి, పొయ్యి రాళ్లతో ఇంట్లోకి వెళ్లి అల్లుడు దేవేందర్ ముఖంపై బలంగా బాదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కర్నూలులో పలు హోటళ్లలో వంట మాస్టర్‌గా పని చేసేవాడని తెలిసింది. మృతుని తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవిబాబు వెల్లడించాడు. నిందితుడు మద్దిలేటి పరారీలో ఉన్నట్లు తెలిపారు. డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సీఐ రవిబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు దారి తీసిన పరిణామాలు, ఇంట్లో జరిగిన ఘర్షణ తదితర అంశాలను ఎస్‌ఐ శ్రీనివాసులు నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన

- ఐదు హామీలపై తొలి సంతకాలు
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు, జూన్ 16: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనతోనే రాష్ట్రంలో అన్ని వర్గాలు అవస్థలు పడ్డారని అన్నారు. ప్రత్యేయించి ఉద్యోగ కల్పన లేక నిరుద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోగానే 16347 ఉపాధ్యాయల పోస్టుల భర్తీకి తొలి సంతకం చేసి మాట నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబుదేనని అన్నారు. అలాగే గత ప్రభుత్వం అప్రజాస్వామ్యంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూడా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో రైతులకు భరోసా కలిగిందని అన్నారు. అదేవిధంగా ఎన్నికల హామీల్లో భాగంగా అధికారంలోకి వస్తే వృద్ధులు, వితంతులకు రూ.3వేల నుంచి రూ.4వేల పింఛన్ పెంపు, దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6వేలు ఇవ్వాలని నిర్ణయించడం గొప్ప విషయమని అన్నారు. ప్రత్యేకించి జూలై నెలలకు రూ.7వేల పింఛన్ ఇవ్వనున్నట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో 66 లక్షల మందికి లబ్ధి చేకూరనుందని వివరించారు. అంతేకాకుండా యువతకు మేలు చేసేలా నైపుణ్య గణన ద్వారా నిరుద్యోగులను గుర్తించి శిక్షణ అందించాలని సంతకం చేయడం హర్షణీయమన్నారు. అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించాలని నిర్ణయించడం వల్ల ఎంతో మంది పేదల కడుపు నిండుతుందని అన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

జూపాడుబంగ్లా, జూన్ 16: దివ్యాంగులకు రూ.3 నుంచి రూ.6 వేలు మంచానికి పరిమితమైన వారికి రూ.5 నుంచి 15వేలకు పెంచిన చంద్రబాబునాయుడి చిత్ర పటానికి ఆదివారం జూపాడుబంగ్లాలో దివ్యాంగులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు రామాంజనేయులు, మోహన్‌రావు, శివరాం, సర్పంచ్ బాలయ్య, టీడీపీ నాయకులు జంగాలపెద్దన్న, సుధాకర్, కృష్ణయ్య, సైఫుద్దీన్, బాబు, శాలు, నరసింహులు, తిరుపాలు సలాం తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్ తనిఖీ



గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల కల్చరల్, జూన్ 16: నంద్యాల, బనగానపల్లెలో సివిల్ సప్లయిస్ గోడౌన్‌లను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. జిల్లాలోని 10 సివిల్ గోడౌన్లను తనిఖీ చేశారు. అనంతరం జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి గోడౌన్‌లను తనిఖీ చేయగా చక్కర, కందిపప్పు, పామాయిల్ ప్యాకెట్లు, తక్కువ తూకాలను గమనించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్, డీఎం సివిల్ సప్లయిస్, టెక్నికల్ అసిస్టెంట్లును టీమ్‌లగా వేసి సోమవారం సాయంత్రానికి నివేదిక ఇవ్వాలని జేసీ అధికారులను ఆదేశించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు: మంత్రి



నంద్యాలలో అమృత్ పథకం నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మంత్రి ఫరూక్‌ను కలిసిన మధుసూదన్‌రెడ్డి

నంద్యాల నూనెపల్లె, జూన్ 16: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు భవిష్యత్తులో మంచినీటి సరఫరా సమస్యను నివారించేందుకు శాశ్వత ప్రాతిపదికన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశించారు. ఆదివారం తాగునీటి అవసరాల కోసం అధనపు ట్యాంక్ నిర్మాణానికి గుర్తించిన 150 ఎకరాల స్థలాన్ని, అమృత్ పథకం పనులను మంత్రి పరిశీలించారు. ఫరూక్ మాట్లాడుతూ గతంలో తాను మున్సిపల్ శాఖ మంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలో పని చేసినప్పుడు నంద్యాల పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి రూ.9 కోట్ల వ్యయంతో ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. అప్పట్లో ఎంతో ముందు చూపుతో నిర్మించిన ఎస్ఎస్ ట్యాంక్‌తో పట్టణ ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాలేదన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా నంద్యాల పట్టణ వాసులకు తాగునీటి అవసరాలు పెరిగిన దృష్ట్యా అదనంగా మరో ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 2014 - 2019 టీడీపీ ప్రభుత్వ హయంలోనే రూ.160 కోట్లతో అమృత్ పథకం కింద వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి భూ గర్భ పైపులైన్ ద్వారా నంద్యాల, చుట్టు పక్కల ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిమిత్తం పనులు చేపట్టి దాదాపు 80 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్ల పాలనలో 20 శాతం పనులను పూర్తి చేయడానికి పూర్తిగా నిర్లక్ష్యం ధోరణితో వ్యవహరించారని విమర్శించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతున్న కొద్ది రోజుల ముందు అమృత్ పథకాన్ని మొత్తం తామే పూర్తి చేశామంటూ వైసీపీ నాయకులు శిలా ఫలకాలు ఆవిష్కరించడం హాస్యాస్పదమని అన్నారు. నంద్యాల మున్సిపాలిటీలోని మొత్తం 42 వార్డుల సమగ్రాభివృద్ధికి త్వరలో పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అమృత్ స్కీమ్‌లో కొన్ని పనులు ఇంకా చివరి దశలో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ మూర్తి, డీఈ శ్రీనివాసరెడ్డి, పలువురు అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బండిఆత్మకూరు మండల నాయకులు

బండిఆత్మకూరు: రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మండలంలోని పలు గ్రామాల నాయకులు కలిశారు. నంద్యాలలోని ఖలీల్ ట్యాకీస్ ఆవరణంలోని పార్టీ కార్యాలయంలో ఎ.కోడూరుకు చెందిన టీడీపీ నాయకులు వడ్డు మధుసూదన్‌రెడ్డి, సోమయాజులపల్లె ప్రజాసంఘాల నాయకుడు రామచంద్రుడు, ఈర్నపాడు, బి.కోడూరు టీడీపీ నాయకులు పలువురు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు మంత్రిని కోరారు.

‘రైతు సంక్షేమానికి కృషి’



కంది విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు రూరల్, జూన్ 16: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో వ్యవసాయశాఖ సంచాలకుడు విజయశేఖర్‌తో కలిసి రైతులకు రాయితీపై కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ప్రాంతంలో ఎక్కువగా మొక్కజొన్న పంటను రైతులు సాగు చేస్తారని, కావున రాయితీపై మొక్కజొన్న విత్తనాలు కూడా తెప్పించే ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖాధికారులకు సూచించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి షేక్షావలి మాట్లాడుతూ కంది విత్తనాలు 4 కేజీల ప్యాకెట్ ధర రూ559.2 అని, 30 శాతం రాయితీ రూ 167.76 పోను రైతు రూ. 391.44 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అలాగే మినుము 4 కేజీల బ్యాగు ధర రూ.560 అని, 30 శాతం రాయితీ రూ.168 పోను రైతు రూ.392 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నందికొట్కూరు మండలానికి రెడ్ గ్రామ్ (కందులు) ఎల్ఆర్‌జీ 52 రకం 45 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 32.28 క్వింటాళ్లు వచ్చాయని తెలిపారు. అలాగే రెడ్ గ్రామ్ (కందులు) ఎల్ఆర్‌జీ 105 రకం 50 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 17.72 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే బ్లాక్ గ్రామ్(మినుములు) వీబీఎన్ 8 రకం 35 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 18.6 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ధైంచా(జీలుగ) 10 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 5.5 క్వింటాళ్ళు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అల్లూరు గ్రామానికి 5 క్వింటాళ్ళు కందులు, 1 క్వింటం మినుములు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, గ్రామ సర్పంచ్ నాగలక్ష్మయ్య, గుండం రమణారెడ్డి, ప్రసాదరెడ్డి. గ్రామ రైతులు పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరు మండలానికి ఎత్తిపోతల ఏర్పాటు చేసి రైతుకు సాగు, తాగు నీరు అందించి, ఇచ్చిన హామీ నెవేర్చుకుంటామని నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మిడుతూరు వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులకు రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, మాండ్ర హాజరై రైతులకు విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుండం రమణారెడ్డి, సర్పంచ్ జయలక్ష్మమ్మ, శివరామిరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, స్వామిరెడ్డి, సర్వోత్తమ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పీరునాయక్, రైతులు పాల్గొన్నారు.

నేడు బక్రీద్

వెలుగోడు, జూన్ 16: మండలంలో బక్రీద్‌ను సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు మత పెద్దలు తెలిపారు. ఈ మేరకు బక్రీద్ పండుగను పురస్కరించుకుని స్థానిక ఈద్గాలో ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేసినట్లు అంజుమన్ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉదయం 8 గంటలకు ఈద్గా ప్రాంతానికి చేరుకోవాలని, 8.30 సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

‘పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి’

బండిఆత్మకూరు, జూన్ 16: మండలంలోని ముస్లిం బక్రీద్ వేడుకను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ మల్లికార్జున సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఏ కోడూరు వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించి పండుగ నిర్వహణపై సూచనలు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఎక్కడ అల్లర్లు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

నంద్యాల కల్చరల్, జూన్ 16: ముస్లింలకు బక్రీద్ పర్వదినం అత్యంత ఆరాధ్యమైనదని, ప్రీతికరమైనదని, బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఖురాన్ ప్రకారం సమాజంలో త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అన్నారు. ఎంలో పవిత్రంగా జరుపుకునే ఈ పండుగ దానగుణానికి, త్యాగానికి ప్రతీక అన్నారు. ఈ పండుగ నంద్యాల జిల్లా వాసులకు సకల శుభాలతో పాటు ఆయురారోగ్యాలు అందాలని, అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షిస్తూ .... రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు ఆర్అండ్‌బీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇన్వెస్ట్‌మెంట్ శాఖ మంత్రి జీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు, డీఆర్వో పద్మజ, మైనారిటీ సంక్షేమ అధికారులు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, జూన్ 16: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం రాత్రి బనగానపల్లెలోని మంత్రి నివాసంలో ఆయనను ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని తాజా పరిస్థితులపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గిత్తా జయసూర్యతో కలిసి చర్చించారు. టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, వీరం ప్రసాద్‌రెడ్డి, గుండం రమణారెడ్డి, పలుచాని మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, రమేష్‌రెడ్డి, నారపురెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, మద్దిలేటి, శేఖర్, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మాజీ ఎంపీపీ మృతి

పాములపాడు, జూన్ 16: మాజీ ఎంపీపీ లక్ష్మీదేవమ్మ (82) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈమె 1996 నుంచి 2001 వరకు టీడీపీ తరుపున ఎంపీపీగా పనిచేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. ఈ నెల 10న ఇంటిలో దేవుని దీపారాధన సమయంలో ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకోవడంతో శరీరం కొంతమేర కాలింది. దీంతో చికిత్స నిమిత్తం కర్నూలు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సం కోసం హైదరబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

సాగులో రైతులు బిజీ



చింతలపల్లిలో సాగులో బిజీగా ఉన్న రైతు



నల్లకాలువలో..

మిడుతూరు, జూన్ 16: గత వారం రోజులుగా కురిసిన వర్షాలతో మండలంలోని చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌లు జలకళను సంతరించుకున్నాయి. ఎగువన ఉన్న ఉయ్యాలవాడ, ఓర్వకల్లు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో మండలంలో చౌట్కూరు, చింతలపల్లి, మిడుతూరు, తలముడిపి, చెరుకుచెర్ల గ్రామాల్లో కుందూ, కాకిలేరు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. కుందూ వాగు ప్రవాహం వల్ల ముఖ్యంగా మద్దిగుండం చెరువుకు కొత్త నీరు చేరి అలుగు ఎక్కి ప్రవహిస్తూ నిండుకుండను తలపిస్తోంది. చెరువుకు పూర్తి స్థాయిలో నీరు చేరడంతో చెరువు కింద సాగు చేసే జలకనూరు, చింతలపల్లి, సుంకేసుల, ఖాజీపేట గ్రామాల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మిగతా చెరువులైన చింతలపల్లి నారపల్లి , జలకనూరు, 49 బన్నూరు చెరువులకు సగానికి పైగా నీరు చేరింది. మరో రెండు వర్షాలు కురిస్తే వీటికి కూడా పూర్తి స్థాయిలో నీరు చేరుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మద్దిగుండం చెరువు కింద దాదాపు 2500 ఎకరాలు, నారపల్లి చెరువు కింద 500 ఎకరాలు, జలకనూరు చెరువు కింద 300 ఎకరాలు, 49 బన్నూరు చెరువు కింద 500 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మిరప, ఉల్లి, పత్తి, కంది, కొర్ర,పొగాకు, మినుము పంటలతో పాటు వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు రైతులు పొలాల్లో బిజీగా ఉన్నారు. వేసవిలో వర్షాలు లేక భూగర్భ జలాలు భారీగ తగ్గాయి. వర్షం రాకతో బోరు బావుల్లో ఇప్పుడిప్పుడే నీటి నిల్వలు పెరగడం వల్ల రైతులు పూర్తిగా పంటలు సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

ఆత్మకూరురూరల్: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించడంతో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో రైతన్నలు ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పంట పొలాల్లో విత్తనాలు విత్తుకుంటూ రైతులు బిజీగా గడుపుతున్నారు. మండలంలోని నల్లకాలువ, కరివేన, సిద్ధాపురం, కృష్ణాపురం, ఇందిరేశ్వరం, శ్రీపతిరావు పేట, కురుకుంద, సిద్దపల్లె ముష్టపల్లి, వెంకటాపురం,అమలాపురం తదితర గ్రామాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేసేందుకు దుక్కి దున్ని విత్తనాలను నాటుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగునీటి సదుపాయం ఉన్న పొలాల్లో ప్రధానంగా వరి పంటలను సాగుచేస్తుండగా, ఆరుతడి పొలాల్లో మొక్కజొన్న, పత్తి, కంది, మినుము, పెసర తదితర పంటలను సాగు చేయడానికి రైతులు సుముఖంగా ఉన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశంఉంటే వరి, మొక్కజొన్న పంటలు, అంతంతమాత్రంగానే వర్షాలు కురిస్తే.. కంది, మినుము, పెసర లాంటి పప్పుధాన్యాల విత్తనాలను సాగుచేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. ప్రస్తుతం తొలకరి వర్షాలు ఆశించిన స్థాయిలో కురియడంతో పాటు రానున్న రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించడంతో రైతులు మొక్కజొన్న సాగు పైనే మొగ్గుచూపుతున్నారు.

‘అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలి’

గోస్పాడు, జూన్ 16: చాలా కాలంగా ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్న అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలని పీఆర్‌టీయూ గోస్పాడు మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గోస్పాడులోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించడం శుభ పరిణామమని, ప్రతి ప్రాథమిక పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. డీఎస్సీ కంటే ముందు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జీవో నంబరు 117 రద్దు చేయాలని, ప్రైమరీ పాఠశాలలకు హెచ్ఎంఎల్, ఎఫ్ఎల్‌హెచ్ఎం పోస్టులు, ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్ఎం పోస్టులు ఇవ్వాలని కోరారు. సీపీఎస్ రద్దుకు కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు విజయరావు, సురేష్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంత్రి బీసీకి అభినందనలు



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని సన్మానిస్తున్న భాస్కరరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 16: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా నియమితులైన బీసీ జనార్దనరెడ్డిని ఆదివారం నంద్యాలకు చెందిన ఆయన సమీప బంధువు భీమిరెడ్డి భాస్కరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బనగాన పల్లె ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలవడం, చంద్రబాబు మంత్రి వర్గంలో చోటు సంపాదించుకోవడంపై భీమిరెడ్డి భాస్కరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భాస్కరరెడ్డితో పాటు నాగేంద్రనాథ రెడ్డి, పుల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి, రమణా రెడ్డి తదిరులు కలిసి మంత్రి బీసీ జనార్దనరెడ్డిని ఘనంగా సన్మానించారు.

‘భూ హక్కు చట్టం రద్దు హర్షణీయం’

నందికొట్కూరు, జూన్ 16: నందికొట్కూరు ప్రజల ఆస్తులకు భద్రతలేని భూ హక్కు చట్టం జీవో నెంబరు 512ను ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దు చేయడం హర్షణీయమని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రైతు సంఘం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నందికొట్కూరు పగిడ్యాల రోడ్డు పొలిమేరలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయడంతో ప్రజలకు ఎంతో మేలు చేసిన వ్యక్తిగా చంద్రబాబు నిలిచారని అన్నారు. రైతు సంఘం నాయకులు సోమన్న, ఉపేంద్ర, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు, మహేష్, మౌలాలి, రఫి పాల్గొన్నారు.

సుగాలిమెట్టలో వైద్య శిబిరం



సుగాలిమెట్టలో వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యుడు

పాణ్యం, జూన్ 16: మండలంలోని సుగాలిమెట్టలో పుట్టిన 25 మంది వైద్యులు, వైద్య విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు ఆదివారం పేబ్యాక్ సొసైటీ నినాదంతో గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన ఐపీఎస్ అధికారి డాక్టర్ డి. తిరిపాల్ నాయక్ కోరిక మేరకు ఆదోని ప్రభుత్వ వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో గ్రామంలోని 180 మందికి బీపీ, సుగర్, గుండె పరీక్షలు, కంటి పరీక్షలు, టీబీ, సాధార పరీక్షలు, సీజనల్ వ్యాధుల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో జన్మించి గ్రామానికి సేవ చేయడంలో ఉన్న ఆనందం ఎనలేనిది అని డాక్టర్ శ్రీనివాసనాయక్ అన్నారు. వైద్య పరీక్షలకు సహకరించిన శాంతిరాం వైద్యశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ చాణక్య, డాక్టర్, ఉపేంద్ర, డాక్టర్ చైతన్య, డాక్టర్ వినీత్, వైద్య విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శి సంతోష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


మహానందిలో భక్తుల రద్దీ



మహానందిలో దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

మహానంది, జూన్ 16: ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా సెలవులు రావడంతో మహానంది క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జామున నుంచే భక్తులు పరమశివుని దర్శనం కోసం ఆలయం ప్రాంగణంలోని క్యూలైన్లల్లో వేచి ఉన్నారు. మరికొందరు భక్తులు రుద్రగుండం, పూల కోనేర్లల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. దేవస్థానానికి చెందిన వసతి గదులు శనివారం సాయంత్రమే భక్తులతో నిండిపోయాయి. దీంతో సమీపంలోని ప్రైవేట్ సత్రాలతో పాటు లాడ్జీల్లో భక్తులు విడిది చేశారు. అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి పార్వతి మహానందీశ్వరున్ని దర్శించుకున్నారు. ఆమె వెంట ఈవోఆర్డీ శివనాగజ్యోతి, పంచాయతీ కార్యదర్శి నాగసంజీవరావు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రొఫెసర్ రత్నస్వామిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వెలుగోడు, జూన్ 16: వెలుగోడులో నీలం సంజీవరెడ్డి డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కళాశాలలో 1987-90 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం సమావేశ మయ్యారు. ప్రొఫెసర్ రత్నస్వామిని ఘనంగా సన్మానించారు. అలాగే పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ప్రిన్సిపాల్ రాంభూపాల్‌రెడ్డి, అధ్యాపకులు జనార్దన్‌రెడ్డి, శ్యాం ప్రసాద్ శర్మ, నారాయణ రెడ్డిని సైతం సన్మానించారు. పూర్వ విద్యార్థులు నాగేశ్వరరావు డివిజనల్ లెవెల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా, రాజకుమార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ సీనియర్ అధ్యాపకుడిగా, రామకృష్ణ, మక్బుల్‌బాషా, వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు.

‘జీవో నెంబరు 117ను రద్దు చేయాలి’

నంద్యాల (నూనెపల్లె), జూన్ 16: గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీవో 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యావ్యవస్థను కాపాడాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసి తదనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి శివయ్య, రాష్ట్ర కౌన్సిలర్ రంగ నాయకులు తిమ్మారెడ్డి, పుల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గిరీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటల్లో పెరిగిన ఆదాయం

బండిఆత్మకూరు, జూన్ 16: మండలంలోని మూడు ఆలయా భూములకు నిర్వహించిన వేలం పాటల్లో ఆదాయం పెరిగినట్లు ఈవో నాగప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్ నేతృత్వంలో ఈర్నపాడు కోదండ రామస్వామి, చెన్నకేశవ స్వామి ఆలయాలకు చెందిన 5.17 ఎకరాలకు గతేడాది రూ.70 వేలు రాగా, ఈ ఏడాది రూ.73,500 వచ్చిందని చెప్పారు. ఓంకార సిద్ధేశ్వర స్వామికి చెందిన 2.50 ఎకరాలకు గతేడాది రూ.49 వేలు రాగా ఈ ఏడాది రూ.85 వేలు వచ్చిందని చెప్పారు. బిజకోడూరులో చెన్నకేశవస్వామికి చెందిన21.53 ఎకరాల భూమికి గత ఏడాది 362,500రాగా, ఈఏడాది రూ.5,34,00 వచ్చిందని చెప్పారు. వేలం పాటల్లో రైతులు, గ్రామ పెద్దలు, సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

మంత్రి బీసీకి అభినందనల వెల్లువ

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై హర్షం



అలేబాదులో హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

ప్యాపిలి, జూన్ 16: మండలంలోని అలేబాదు గ్రామంలో ఆదివారం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శి అలేబాదు పరమేష్ మాట్లాడుతూ రైతుల పొలాలను ఖాజేసేందుకు వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తీసుకొచ్చిందన్నారు. అయితే రైతుల కొంప ముంచే ఆ యాక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌నాయక్

ప్యాపిలి, జూన్ 16: గ్రామీణ విద్యార్థుల విద్యను దెబ్బతీసే 117 జీవోను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సెలర్ వెంకటనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో సంఘం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ జీవోను రద్దు చేయడం వలన రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాథమిక పాఠశాలలు తెరుచుకుంటాయన్నారు. అలాగే ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తొలగించి విద్యా ప్రమాణాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు చిన్నపురెడ్డి, హాజీమస్తాన్‌వలి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పల్లకీ ఉత్సవం



సీతారాములకు పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, జూన్ 16: చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభి రామ ఆలయాల్లో ఆదివారం సీతారాముల పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. లలిత సహస్ర నామ పారాయణం నిర్వహించారు. చింతలచెరువు గ్రామంలో సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి పల్లకీ ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పెద్దమ్మ, గంగమ్మకు దీపోత్సవం

చాగలమర్రిలోని పెద్దమ్మ, గంగమ్మ, చాగలమ్మ ఆలయాల్లో ఆదివారం మహిళలు సామూహిక దీపోత్సవాన్ని నిర్వహించారు. 108 దీపోత్సవం చేశారు. పెద్దమ్మకు బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. సామూహికంగా మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పెద్దమ్మకు పూజలు

రుద్రవరం, జూన్ 20: రుద్రవరం, కొండమాయపల్లె, చిన్నకంబలూరు, యల్లావత్తుల గ్రామాల్లో ఆదివారం పెద్దమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు చీరలు సమర్పించారు. అలాఏగ రుద్రవరం సమీపంలో కొలువుదీరిన జంబులా పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అర్చకులు పూజలు ప్రారంభించగా తరలివచ్చిన భక్తులు బోనాలు చీరలు సమర్పించారు.

● మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం చేసి పూజలు ప్రారంభించగా, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించారు.

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలను అందజేశారు.

గంగమ్మకు పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ, జూన్ 16: మండలంలోని ఇంజేడు గ్రామంలో ఆదివారం గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామం అంతా కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి అభిషేకం అలంకరణ చేశారు. గ్రామస్థులు అమ్మవారికి కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

20న ఆలయ భూముల కౌలు వేలం

శిరివెళ్ల, జూన్ 16: శిరివెళ్లలోని ఓంకారేశ్వరస్వామి ఆలయానికి చెందిన 51.30 ఎకరాల భూములకు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు కోటపాడు గ్రూపు దేవాలయాల ఈవో గంటా వేణునాథరెడ్డి ఆదివారం తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను ఏడాది కాల పరిమితితో నిర్వహిస్తున్న ఈ వేలంపాటలో పాల్గొనదలచిన వారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. ఆలయానికి పాత బకాయిలు ఉన్నవారు వేలంపాటలో పాల్గొనేందుకు అనర్హులని ఈవో తెలిపారు.

నేడు కిష్టిపాడులో..

దొర్నిపాడు, జూన్ 16: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో వెలసిన నాగేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన భూములకు సోమవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి చంద్రుడు తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

ఎమ్మెల్యే కోట్లకు మంత్రి పదవి ఇవ్వాలి

బేతంచెర్ల, జూన్ 16 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి వర్గంలో డోన్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాలుకా రాజయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మద్దిలేటి సురేష్‌ల అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాజయ్య మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో కోట్ల కుటుంబం మచ్చలేని కుటుంబంగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కోట్లకు మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో చంద్రుడు, గుండన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

డోన్(రూరల్), జూన్ 16: మండలంలోని ఎద్దుపెంట గ్రామానికి చెందిన మేరీ (8) ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. వారం క్రితం ఎద్దుపెంట గ్రామంలోని ఇంట్లో ప్రమాదవశాత్తు కట్టెలపొయిలో పెట్రోల్ పడి నిప్పంటుకొని బాలిక తీవ్రంగా గాయపడింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మంత్రి బీసీని అభినందిస్తున్న జనసేన పార్టీ నాయకులు



బీసీని అభినందిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



కేక్ కట్ చేసి బీసీ ఇందిరమ్మను అభినందిస్తున్న మహిళలు



మంత్రిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బనగానపల్లె , జూన్ 16: రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని ఆదివారం అభినందనలు వెల్లువెత్తాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు జనసేన, బీజేపీ నాయకులు బీసీని అభినందించారు. పూలబొకేలు, పూలమాలలు, శాలువాలు వేసి మంత్రి బీసీని సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిలాల్లోని వివిధ ప్రాంతాలనుంచి వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్య, వైద్య, రెవెన్యూ, ఎంపీడీవో పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, అంగన్‌వాడీ, వెలుగు, పొదుపు మహిళలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, సిబ్బంది, వ్యవసాయ, విద్యుత్, ఫైర్‌స్టేషన్ సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది, సచివాలయ, గ్రామపంచాయితీ , మైనింగ్ శాఖ అధికారులు, దేవాదాయశాఖ, విద్యాశాఖ, ఆర్టీసీ సిబ్బంది బీసీని అభినందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వేలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీసీ స్వగృహానికి తరలిరావడంతో బీసీ నివాసం కిక్కిరిసింది. బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మను పలువురు పూలబొకేలు, పూలమాలలు వేసి సన్మానించారు. అలాగే ఆయన సోదరుడు బీసీ రామనాథరెడ్డి ని కూడా పలువురు అభినందించారు.

మంత్రి బీసీకి పూల తివాచితో స్వాగతం

బనగానపల్లె రూరల్, జూన్ 16: మంత్రి హోదాలో బీసీ జనార్ధన్‌రెడ్డి మొదటిసారి బనగానపల్లెకు వచ్చిన సందర్భంగా టీడీపీ నాయకుడు ఆర్.అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుపై పూలను తివాచిలా పరిచి వినూత్న రీతిలో స్వాగతం పలికారు. శనివారం రాత్రి బనగానపల్లెకు చేరుకున్న మంత్రి బీసీకి స్వాగతం పలికేందుకు టీడీపీ నాయకులు ఆర్.అమర్‌నాథ్ రెడ్డి, బండి మౌళీశ్వరరెడ్డి, బత్తుల నారాయణరెడ్డి, సంగు శంకేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఓ ట్రాక్టర్‌కు బంతి, గులాబీ పూలు తెప్పించి దారిపొడవునా తివాచి పరిచారు. అయ్యప్ప స్వామి గుడి నుంచి పెట్రోల్ బంక్, ఆస్థానం రోడ్డు, పాత పోలీస్‌స్టేషన్ మీదుగా బీసీ ఇంటి వరకు దాదాపు రెండు కిలో మీటర్ల మేర దారి పొడవున పూల తివాచి పరిచి ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో భూషన్న, నల్లమేకల రామశేఖర్, బండి వెంకటేశ్వర్లు, సురేంద్రరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి బీసీని కలిసిన టీడీపీ నాయకులు

కోవెలకుంట్ల: మంత్రి బీసీ జనార్ధనరెడ్డిని పలువురు టీడీపీ నాయకులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తొలిసారిగా మంత్రి బీసీ జనార్ధనరెడ్డి బనగానపల్లెకు వచ్చారు. విషయం తెలుసుకున్న కోవెలకుంట్ల మండలంలోని పలువురు టీడీపీ నాయకులతో పాటు ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆదివారం బనగానపల్లె చేరుకుని మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అందులోభాగంగా కోవెలకుంట్ల మండల టీడీపీ ఉపాధ్యక్షులు కలుగొట్ల అర్జున్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బిజినవేముల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు హుసేనయ్య జోళదరాశి గ్రామానికి చెందిన గోవర్ధనరెడ్డి, కంపమల్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సుబ్బారెడ్డితో పాటు పలువురు నాయకులు మంత్రి బీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎస్టీయూ రాష్ట్ర మాజీ అదనపు ప్రధాన కార్యదర్శి ప్రసాదరెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయులు బనగానపల్లె పట్టణానికి చేరుకుని మంత్రి బీసీ జనార్దనరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బేతంచెర్ల : మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని ఆదివారం ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షులు మౌలాలి, ప్రధాన కార్యదర్శి అజాంబేగ్ ఆధ్వర్యంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని ఆదివారం ఎస్టీయూ ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమానికి రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్, రాష్ట్ర మాజీ అదనపు ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ రెడ్డి, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, మాజీ అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, వెంకటేశ్వర రెడ్డి, టీవీ సుబ్బారెడ్డి, జీవీ నారాయణరెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, నాగేశ్వరయ్య, ఇమ్రాన్, ఆదిశేషగిరిరావు, మనోహర్, రవీంద్రారెడ్డి, నాగేశ్వర నాయక్, శ్రీనివాసరెడ్డి, మదన్, పుల్లయ్య, మల్లేష్, బాలమదిరాజు శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రులకు గౌరు దంపతుల శుభాకాంక్షలు

కల్లూరు, జూన్ 16: రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం బనగానపల్లెకు విచ్చేసిన రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం బనగానపల్లెలోని బీసీ నివాసంలో మంత్రిని కలిసిన గౌరు చరిత పుష్పగుచ్ఛం అందించారు.

● రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం గౌరు దంపతులు మంత్రి ఫరూక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పాలకొలను సుధాకర్‌రెడ్డి, దేవేంద్రారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, క్రిష్ణ నాయక్ పాల్గొన్నారు.



విజయ సంకేతం చూపిస్తున్న టీడీపీ నాయకులు



మంత్రి బీసీ జనార్ధనరెడ్డిని కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు



బీసీ దంపతులను సన్మానిస్తున్న గౌరు దంపతులు



మంత్రిని అభినందిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు



రాంపురంలో బీసీకి ఘన స్వాగతం పలుకుతున్న నాయకులు

అందరికీ న్యాయం చేస్తాం: మంత్రి బీసీ

రామాపురంలో మంత్రి బీసీకీ ఘనస్వాగతం



ఐవి పక్కీర రెడ్డిని అభినందిస్తున్న మంత్రి బీసీ

అవుకు, జూన్ 16: ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చి అందరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి 9గంటల ప్రాంతంలో టీడీపీ సీనియర్ నాయకులు ఐవి పక్కీరరెడ్డిని కలిసేందుకు మంత్రి బీసీ, సతీమణి ఇందిరమ్మ, కూతురు మనోరమరెడ్డి, అల్లుడు రమణారెడ్డి రామాపురం గ్రామానికి రావటంతో టీడీపీ నాయకులు ఐవీ ఉగ్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. ఐవీ పక్కీర రెడ్డిని మర్యాద పూర్వకంగా బీసీ కుటుంబ సభ్యులు కలిసి అభినందించారు. అలాగే అవుకు చేరుకొని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయ భాస్కర్ రెడ్డిని కలిశారు. బీసీ మాట్లాడుతూ టీడీపీ గెలుపులో ఐవీ పక్కీరరెడ్డి పాత్ర కీలకం అన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో అర్హులైన వారందరికి లబ్ధి చేకూరుతుందన్నారు. తనను ఆదరించి గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి కార్యకర్తకు ఏ సమస్య వచ్చిన న్యాయం చేస్తామన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఇంత వరకు ఎవరికి దక్కనటువంటి మంత్రి పదవి తనకు ప్రజల ఆశీర్వాదంతో లభించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, నారపు రెడ్డి, శివరామి రెడ్డి, నాగిరెడ్డి, వెంకట రమణ నాయక్, అరుణ్ కుయార్‌నాయక్, వెంక ట రాముడునాయక్, దంతెల రమణ, తిక్కన్న, అవుకు, కొలిమిగుండ్ల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈద్గా ముస్తాబు

చాగలమర్రి, జూన్ 16: చాగలమర్రిలో సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా అడ్డవాగు సమీపంలోని ఈద్గాను ముస్తాబు చేశారు. పంచాయతీ కార్మికులచే ఈద్గా ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. గ్రామంలోని ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు సౌకర్యాలు కల్పించారు. బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, ఈద్గా వద్ద ప్రార్థనలు చేయాలని ప్రభుత్వ ఖాజీ యూనస్ సూచించారు.

రుద్రవరం: బక్రీదు పండగ ఈదుల్ ద్వాహ నమాజ్‌లకు ఈద్గాలు, మసీదులు సిద్ధం చేశారు. శుభ్రం చేసి సోమవారం నమాజ్‌లు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మండలంలోని రుద్రవరం, కొండమాయపల్లె, పెద్దకంబలూరు, చిన్నకంబలూరు, నరసాపురం, ఆలమూరు, మందలూరు గ్రామాలతో పాటు ఇంకా పలు గ్రామాల్లో సిద్ధం చేశారు.

విద్యార్థులకు గొడుగులు, పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల, జూన్ 16 : బేతంచెర్ల పట్టణంలోని పాతబస్టాండులో చిరు వ్యాపారులకు, పాఠశాల విద్యార్థులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులు, పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డెస్క్ ప్రోగ్రాంలోని సప్త సేవా కార్యక్రమాలో భాగంగా వీధి వ్యాపారులకు గొడుగులు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఐఈసీ ఆఫీసర్ దొంతు సుబ్రహ్మణ్యం, గవర్నర్ జయంతి వెంకటేశ్వర్లు, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కందగడ్ల మోహన్‌రావు, రీజనల్ చైర్మన్ బి.ధనుంజయ, అధ్యక్షులు గుంతా వెంకటసుబ్బయ్య గుప్తా, కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి మధు, సురేంద్రబాబు, సభ్యులు, వ్యాపారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి వడ్డెమాను వాసి మృతి

బేతంచెర్ల, జూన్ 16 : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి క్షేత్రంలోని కోనేరులో ఈతకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గద్వాల మండలం వడ్డెపల్లికు చెంది కురువ మహేష్ (34) మద్దిలేటి స్వామి దర్శనార్థం కోసం శనివారం ఆలయానికి వచ్చారు. 10 గంటల సమయంలో కోనేరులో ఈతకు వెళ్లాక బంధువులకు కనిపించలేదు. ఎక్కడికో వెళ్లి వస్తాడని, తిరిగి వస్తాడని స్వగ్రామానికి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం మృతదేహం కోనేరు నుంచి బయట పడింది. ఆలయ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతుని సెల్ ఫోన్ ముళ్లపొదలో లభించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బనగానపల్లెకు పంపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆలయ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీని కలిసిన యువత



ఎంపీ బైరెడ్డి శబరిని కలిసిన కొండమనాయిని పల్లె యువత

అవుకు , జూన్ 16: అవుకు మండలం కొండమనాయిని పల్లె గ్రామానికి చెందిన టీడీపీ యువత నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని కలిసినట్లు రాయలసీమ ఉద్యమ నాయకులు రాథోడ్ సీమకృష్ణ ఆదివారం తెలిపారు. నంద్యాల పట్టణంలో ఎంపీ బైరెడ్డిశబరిని కలిసి శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ యువత రాజా,రంగముని నాయక్, వెంకటేష్ నాయక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పెండేకంటికి ఘన సన్మానం



పెండేకంటి కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న స్నేహితులు

సంజామల, జూన్ 16: కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు పెండేకంటి కిరణ్ కుమార్‌కు సహచర మిత్రులు ఆదివారం ఆయన నివాసగృహంలో ఘనంగా సత్కరించి సన్మానించారు. ఉదయం కిరణ్ కుమార్, మిత్రులతో కలిసి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి వచ్చారు. అనంతరం సంజామల నాటి మిత్రుడు శ్రీనివాస రెడ్డి, నారాయణ రెడ్డి, శిల్ప సుబ్రహ్మణ్యం, నారాయణ, నరసింహ, మద్దిలేటి, మహేష్, శివరామి రెడ్డి, మక్బుల్ హుస్సేన్, కొలిమిగుండ్ల ఖాజా, ఉశేని పూలమాలలు, శాలువాలతో కిరణ్‌ను సన్మానించారు.

మంత్రి బీసీని కలిసిన నాయకులు



బీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న రామేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 16: కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి బీసీ దంపతులకు అభినందనలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, పులి ప్రకాశ్‌రెడ్డి, ఇటిక్యాల బాలిరెడ్డి, అంబటి జయలక్ష్మీరెడ్డి, అంబటి వివేకానందరెడ్డి, కామిని క్రిష్ణరంగారెడ్డి, భాస్కరరెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, జనసేన నాయకులు పెద్దయ్య, రామ్మూర్తి బీసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మొక్కు చెల్లించుకున్న టీడీపీ నాయకులు

● పలుకూరు నుంచి నందవరం వరకు పాదయాత్ర



పాదయాత్రగా వస్తున్న పలుకూరు టీడీపీ నాయకులు

బనగానపల్లె రూరల్, జూన్ 16: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నందవరం చౌడేశ్వరిదేవికి మొక్కులు చెల్లించుకున్నారు. బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్ధన్‌రెడ్డి భారీ మెజార్టీతో ఘన విజయం సాధించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రిగా నియమితులు కావడంతో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అంబాల ప్రభాకర్‌రెడ్డి, గుండం మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పలుకూరు నుంచి బీరవోలు, చెరువుపల్లె మీదు నందవరం వరకు 9 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేసి చౌడేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. పాదయాత్రగా నందవరం చేరుకున్న టీడీపీ నాయకులకు చౌడేశ్వరిదేవి ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. బీసీ జనార్దన్‌రెడ్డికి మంత్రి వర్గంలో స్థానం కల్పించి కీలకమైన శాఖలు అప్పగించినందుకు సీఎం చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'రాష్ట్రంలో ప్రజా పాలన'



మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ నంద్యాల అధికార ప్రతినిధి నాగరాజు

చాగలమర్రి, జూన్ 16: రాష్ట్రంలో రాక్షస పాలన అంతమైందని, ప్రజా పాలన వచ్చిందని టీడీపీ బీసీ సెల్ నంద్యాల అధికార ప్రతినిధి సల్లా నాగరాజు అన్నారు. చాగలమర్రిలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మొదట 5 సంతకాలతోనే పాలన ప్రారంభించడం పట్ల హర్షం ప్రకటించారు. రాష్ట్రంలో చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం తథ్యమని అన్నారు. జూలై 1న ఇంటింటికి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా డీఎస్సీపై గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు రెండో విడతలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు మహబూబ్‌బాషా, భాస్కర్‌రెడ్డి, రమేష్, బషీర్, బాల దస్తగిరి, ఓబులేసు, చోటు తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఈవో పీరయ్య

దొర్నిపాడు, జూన్ 16: దొర్నిపాడు గ్రామంలో ఆదివారం ఈవో పీరయ్య ఆధ్వర్యంలో ఆలయ భూముల వేలం పాట నిర్వహించారు. మాధవస్వామి, గణాధిపతిస్వామి, చౌడేశ్వరి ఆలయాలకు చెందిన ఆలయ భూములను వేలం పాట నిర్వహించారు. మాధవస్వామి దేవస్థానానికి చెందిన 36.72 ఎకరాలను రూ.5.38 లక్షలు పాట పాడగా గత ఏడాది రూ.5.03 లక్షలకు వేలం పాట పాడినట్లు తెలిపారు. ఈ ఏడాది అదనంగా రూ.35 వేలు ఆదాయం వచ్చిందని చెప్పారు. అలాగే గణాధిపతి, చౌడేశ్వరి ఆలయాలకు చెందిన 19.87 ఎకరాల భూములను వేలం వేయగా రూ.4.77 లక్షలకు వేలం పాట పాడారు. గత ఏడాది రూ.4.56 లక్షలు రాగా రూ.21 వేలు ఈ ఏడాది అదనంగా రావడం జరిగిందని ఈవో పీరయ్య వెల్లడించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ సిద్ధి సత్యం, బత్తుల నాగేశ్వరరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు ఉన్నారు.